క్లుప్తంగా

శుభ్రత పాటించని టిఫిన్ సెంటర్లకు జరిమానా



జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

పెద్దపల్లి రూరల్: పట్టణంలోని టిఫిన్ సెంటర్లు శుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ ఆదేశించారు. లేదంటే టిఫిన్ సెంటర్ యజమానులకు జరిమానా విధిస్తామన్నారు. బుధవారం పలు టిఫిన్ సెంటర్లను ఆయన తనిఖీ చేశారు. కమాన్ ప్రాంతంలోని ఓ టిఫిన్ సెంటర్ యజమానికి రూ.5వేల జరిమానా విధించారు. టిఫిన్ సెంటర్లలో నిల్వ ఉంచిన పదార్థాలతో టిఫిన్లు అందిస్తే చర్యలు తప్పవన్నారు. కిచెన్‌లను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వార్డు ఆఫీసర్లు ప్రదీప్, శ్రీనివాస్, కుమార్, సుధీర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ఓదెల: ఓదెలలో రోడ్డు పనులను స్థానిక నాయకులు బుధవారం ప్రారంభించారు. జీపీ నిధులు రూ.6లక్షలతో ఓదెల తారకరామగేట్ నుంచి ఎస్సారెస్పీ కాలువ వరకు రోడ్డు పనులు వేగవంతం చేస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో మండల ప్రజల ఇబ్బందులు తొలగుతాయన్నారు. మాజీ ఎంపీటీసీ బోడకుంట చిన్నస్వామి, కాంగ్రెస్ నాయకులు చీకట్ల మొండయ్య, అల్లం సతీశ్, రాపల్లి రాజన్న, గొర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ సెంటర్లలో అనధికార ‘మీసేవ’



వినతిపత్రం అందిస్తున్న ఆపరేటర్లు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రమైన పెద్దపల్లిలో కొందరు ఆన్‌లైన్ సెంటర్ల నిర్వాహకులు సరిగ్గా నడవని కొన్ని మీసేవ కేంద్రాల లాగిన్‌లతో అనధికారికంగా కార్యకలాపాలు నిర్వహిస్తూ, అసలైన నిర్వాహకులకు ఇబ్బందులు సృష్టిస్తున్నారని ఆపరేటర్ల సంఘం మండల శాఖ అధ్యక్షుడు మిట్టపల్లి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. మీసేవ ఆపరేటర్లతో కలిసి బుధవారం డెప్యూటీ తహసీల్దార్ విజేందర్‌కు వినతిపత్రం అందించారు. మండలవ్యాప్తంగా 26 మీసేవ కేంద్రాలు ఉండగా అందులో 10 వరకు సెంటర్లు సరిగ్గా నడపడం లేదని పేర్కొన్నారు. ఆ సెంటర్లలో సేవలు సరిగ్గా అందించకపోవడంతో వాటి దుష్ఫలితాలు ఆపరేటర్లందరిపై ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి సెంటర్లను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం నాయకులు కుంకుమల్ల సత్యనారాయణ, భూమయ్య, మల్లేశం, సత్యనారాయణ, సురేశ్, నవీన్, తిరుపతి, రాజు, సాగర్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు

మంథని: మంత్రి శ్రీధర్‌బాబును విమర్శిస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంథనిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అయిలి ప్రసాద్, సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, ప్రచార కమిటీ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కొండ శంకర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆకుల కిరణ్ మాట్లాడారు. దళితులకు న్యాయం చేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. జెడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధు కాంగ్రెస్‌పై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలన్నారు. సీనియర్ నాయకులు గోటికార్ కిషన్, మంథని సత్యం, కుడుదుల వెంకన్న, మాజీ వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, మాజీ కౌన్సిలర్లు వీకే రవి, సమ్మయ్య, నాయకులు మంథని రాకేశ్, మాజీ సర్పంచ్ చంద్రు రాజమల్లు, ఎరుకల మధు, బండారి ప్రసాద్, రామ్ రాజశేఖర్, వేల్పుల రాజు, నాగుల రాజయ్య, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఆర్ల నాగరాజు, ఉట్ల అనిల్‌రెడ్డి, ఎరుకుల సురేశ్, ఎల్లంకి వంశీ తదితరులు పాల్గొన్నారు.

తిరంగా యాత్రను విజయవంతం చేయాలి

జూలపల్లి: పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఈ నెల 23న సాయంత్రం ప్రారంభమయ్యే తిరంగా యాత్రను విజయవంతం చేసేందుకు తరలిరావాలని బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు కంకణాల జ్యోతి బసు కోరారు. జూలపల్లిలో బుధవారం ఆయన మాట్లాడుతూ స్థానిక కళాశాల మైదానం నుంచి మొదలయ్యే తిరంగా యాత్రకు కులాలు, పార్టీలు, మతాలకతీతంగా, జాతీయ జెండాలు పట్టుకొని సైనికులకు మద్దతుగా ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సంకెళ్ల నర్సయ్య, జక్కని ఉమేశ్, నరేశ్, భద్రయ్య ఉన్నారు.

భూసారం.. పచ్చిరొట్టతో సాకారం

- భూమి సారవంతం చేసే దిశగా రైతులు
- జనుము, జీలుగ, పిల్లిపెసర సాగు చేస్తున్న అన్నదాతలు
- సలహాలు, సూచనలు అందిస్తున్న వ్యవసాయ అధికారులు



పాలకుర్తిలో సాగుచేసిన జనుము పంట

పాలకుర్తి: సాగులో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించేందుకు రైతులు ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నారు. ఏటా వ్యవసాయ పంటల సాగులో భాగంగా విచ్చలవిడిగా ఉపయోగిస్తున్న రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకంతో భూమిలో సారవంతం తగ్గి ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రావడం లేదు. అయితే ఈ చర్యలకు స్వస్తి పలికి భూమిని సారవంతం చేసే దిశగా రైతులు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగానే సేంద్రియ ఎరువుల సాగుపై అన్నదాతలు ఆసక్తి చూపుతున్నారు.

భూసారం పెంచే దిశగా రైతన్న..

ఒకప్పుడు సాగుకు ముందు రైతులు భూమిని సారవంతం చేసేందుకు గేదెలు, మేకలు, గొర్రెలు తదితర పశువుల పేడతో పాటు కోళ్ల ఎరువును ఉపయోగించేవారు. దీంతో భూమి సారవంతమై సాగు చేసిన పంటలు చీడ పీడలను తట్టుకునేవి. తద్వారా తక్కువ పెట్టుబడితో రైతులు అధిక దిగుబడి పొందేందుకు అవకాశం ఏర్పడేది. అయితే ఆధునిక జీవన విధానంతో పల్లెలకు సైతం విస్తరించిన ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామాల్లో సైతం పశుపోషణ పూర్తిస్థాయిలో తగ్గి కనీసం పశువుల పేడ దొరకని పరిస్థితి నెలకొంది. ఒకవేళ లభించిన ఒకట్రాక్టర్ ఎరువుకు దాదాపు రూ.3వేల నుంచి రూ.4వేల వరకు ఖర్చు అవుతోంది. దీంతో రైతులపై ఆర్థిక భారం పెరుగుతోంది. దీనికి తోడు ఒకట్రాక్టర్ ఎరువు 10 నుంచి 15గుంటల విస్తీర్ణానికి మాత్రమే సరిపోతుంది. ఈ నేపథ్యంలో రైతులు తక్కువ ఖర్చుతో సాగయ్యే సేంద్రియ(పచ్చిరొట్ట) ఎరువుల సాగుపై దృష్టిసారిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ పంటలను ప్రోత్సహించేందుకు రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేస్తోంది. దీంతో ఖరీఫ్ సాగుకు ముందు రైతులు జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి సేంద్రియ ఎరువుల పంటలు సాగు చేసి భూసారం పెంచుకుంటున్నారు. మండలవ్యాప్తంగా రెండురోజుల వ్యవధిలో దాదాపు 500 ఎకరాల విస్తీర్ణంలో సాగుకు సరిపడా జనుము, పెసర విత్తనాలను రైతులు కొనుగోలు చేశారు.

తక్కువ ఖర్చు.. ఎక్కువ విస్తీర్ణం

తక్కువ ఖర్చుతో ఎక్కువ విస్తీర్ణంలో సాగయ్యే ఈ పంటలతో రైతులు దృష్టిసారించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. భూసారం తగ్గిపోయిందని విచ్చలవిడిగా డీఏపీ, యూరియా వంటి ఎరువులు వాడితే భవిష్యత్‌లో భూములు సాగుకు పనికి రాకుండా పోతాయని అధికారులు చెప్తున్నారు. పచ్చిరొట్ట ఎరువులు సాగుచేయడంతో రసాయనిక ఎరువుల వినియోగం తగ్గి రైతులకు ఆర్థికంగా మేలు చేకూరుతుందని, రైతులు ఈ దిశగా ఆలోచన చేయాలని అధికారులు కోరుతున్నారు.

సాగు చేయు విధానం..

- రబీ వరి కోతలు పూర్తి కాగానే సేంద్రియ ఎరువుల పంటలు సాగు చేయాలి.
- వరి పండించే పొలాల్లోనే వీటిని సాగు చేసుకోవాలి.
- ఒక ఎకరానికి 8 నుంచి 12కిలోల విత్తనాలు అవసరం.
- విత్తనాలు నాటిన 45 నుంచి 50రోజుల్లోపు నీరు పెట్టి కలియదున్నాలి.
- దున్నిన తర్వాత సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వేసి పంటను మురగనివ్వాలి. తద్వారా తొందరగా కంపోస్టు ఎరువుగా మారుతుంది.

సేంద్రియ ఎరువుతో ఉపయోగాలు:

నత్రజనిని స్వీకరించే బ్యాక్టీరియా ఎక్కువవుతుంది. భూమిలో సేంద్రియ కర్బనం అధికంగా పెరుగుతుంది. దీంతో పంటకు చెడు ప్రభావం పూర్తిగా తగ్గుతుంది.

కృత్రిమ ఎరువుల వినియోగం తగ్గి భూమి సారవంతం అవుతుంది.

పెట్టుబడులు కూడా తగ్గి అధిక దిగుబడి పొందే అవకాశం ఉంటుంది.

దిగుబడి పెరిగే అవకాశం

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. సేంద్రియ ఎరువులను సాగు చేసి పొలంలో కలియ దున్నడంతో భూమి సారవంతమై పంట దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది. దీంతోపాటు పెట్టుబడి ఖర్చు కూడా ఆదా అవుతుంది. కాబట్టి రైతులు తప్పకుండా పచ్చిరొట్ట విత్తనాలను తమ పొలాల్లో సాగుచేసుకోవాలి.

– బండి ప్రమోద్‌కుమార్, మండల వ్యవసాయాధికారి

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి



గోదావరిఖని: నివాళి అర్పిస్తున్న నాయకులు



మంథనిలో..



యైటింక్లయిన్‌కాలనీ: కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

గోదావరిఖని: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని బుధవారం స్థానిక జనక్‌భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలు వేసి నివాళి అర్పించారు. నాయకులు వికాస్‌కుమార్‌యాదవ్, వడ్డేపల్లి దాస్, ఆంజనేయులు, మంద రమేశ్, తాటి రాజయ్య, గడ్డం వెంకటేశ్వర్లు, బర్ల మనోహర్ పాల్గొన్నారు.

మంథని: మంథనిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంథని మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. మంథని మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్, నాయకులు వొడ్నాల శ్రీనివాస్, కొత్త శ్రీనివాస్, కుడుదుల వెంకన్న, ఉదరి శంకర్, పెరవేన లింగయ్య, రాం రాజశేఖర్, ఆకుల కిరణ్, గోటికార్ కిషన్, మంథని సత్యం పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం దేశ మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ వర్ధంతి నిర్వహించారు. కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్ నాయకులతో కలిసి రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు తిరుపతిరెడ్డి, చక్రపాణి, రాములు, సాగర్, అవినాష్, రాజేశం, లక్ష్మణ్, శ్రీనివాస్, రాకేశ్, నవీన్, తిరుపతి పాల్గొన్నారు.

ముత్తారం: ముత్తారంలోని కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య, సింగిల్‌విండో వైస్ చైర్మన్ ఏలువాక కొమురయ్య, డైరెక్టర్ గుజ్జ గోపాల్‌రావు, నాయకులు గాదం శ్రీను, లక్కం ప్రభాకర్, అల్లం పాపయ్య, కుక్కల చందు, పింగిలి రవీందర్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• అందుబాటులో జీలుగ విత్తనాలు

రామగిరి: మండలంలో 50 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్ తెలిపారు. రత్నాపూర్ రైతువేదికలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఏఆర్‌ఎస్‌కే బేగంపేటలో 95క్వింటాళ్లు, డీసీఎంఎస్ కల్వచర్లలో 70 క్వింటాళ్లు, సుందిళ్లలో 85క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. సబ్సిడీ మినహా 30కిలోల జీలుగ బస్తాకు రూ.2137.5 చెల్లించాలన్నారు. పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డులు సమర్పించి పర్మిట్ పొంది విక్రయకేంద్రాల్లో విత్తనాలు తీసుకోవాలని వివరించారు.

• వాహనాల తనిఖీ

ఓదెల: మండలంలోని పొత్కపల్లిలో ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో బుధవారం వాహనాలను తనిఖీ చేశారు.

• బోధనలో మెలకువలపై శిక్షణ

జూలపల్లి: విద్యార్థులకు సులభతర బోధనలో మెలకువలు పాటించాలని ఎంఈవో సరస్వతి సూచించారు. మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో బుధవారం ఎలిగేడు, జూలపల్లి మండలాలకు చెందిన ఎస్‌జీటీలు, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలకు పలు సూచనలు చేశారు.

• హనుమాన్ దీక్షాపరులకు భిక్ష

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని పూసాల మార్కండేయ ఆలయంలో హనుమాన్ దీక్షాపరులకు పద్మశాలి సేవా సంఘం జిల్లా కన్వీనర్ వలస నీలయ్య బుధవారం భిక్ష ఏర్పాటు చేశారు. అంతకుముందు హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వలస నీలయ్య, భాస్కర్‌తో సహా వ్యాపారవేత్త దుగ్యాల సంతోష్‌రావు, సంకల్ప ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తుమ్మ రాజ్‌కుమార్, శిబిరం కన్వీనర్ చిలగాని విశ్వనాథ్, కోకన్వీనర్లు తుమ్మ నిశాంత్, సంతోష్, ఆషాడపు క్రాంతికుమార్, మల్లేశం, దేశెట్టి రమేశ్, జూపాక కుమారస్వామి, శ్రీరాములు, తిరుపతిరావు పాల్గొన్నారు.


• ‘మా భూమి మాకు ఇప్పించండి’

పెద్దపల్లిరూరల్: ‘మా భూమికి సంబంధించి అక్రమంగా పట్టా పొంది సాగు చేయకుండానే పంటరుణం తీసుకుంటూ, రైతుబంధు స్వాహా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి’ అని ముత్తారం మండలంలోని మచ్చుపేటకు చెందిన రైతు ముత్తె రాజయ్య కోరారు. బుధవారం కలెక్టర్ శ్రీహర్షకు ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. తమ భూమి హద్దులు నిర్ధారించాలని సర్వే అధికారులను కోరామన్నారు. ఈనెల 21న (బుధవారం) సర్వే చేసేందుకు వస్తున్నట్టు నోటీసులు అందించారన్నారు. సర్వే చేసేందుకు వచ్చే అధికారిని సంబంధిత శాఖ ఉన్నతాధికారులు రాకుండా అడ్డుకుని తమకు అన్యాయం చేసేందుకు యత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతు కోరారు.

• 23న కేడీసీసీ బ్యాంకు ప్రారంభం

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వెనుక నిర్మించిన కేడీసీసీ బ్యాంకు 23న ప్రారంభించనున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ తెలిపారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు హాజరవుతారని తెలిపారు. రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలతో పాటు వాణిజ్య బ్యాంకులకు దీటుగా రైతులకు, వ్యాపారులకు రుణాలు ఇస్తామని ఆయన పేర్కొన్నారు.

టీజీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షలో ప్రభుత్వ విద్యార్థులకు ర్యాంకులు



వైద్య శ్రీవరుణ్

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు టీజీఆర్‌జేసీ నిర్వహించిన ప్రవేశ పరీక్షలో రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించారు. వైద్య శ్రీవరుణ్‌కు 76వ ర్యాంకు, కుమ్మం హర్షవర్ధన్ 137వ ర్యాంకు, పెనుగొండ హార్థిక్ 1703 ర్యాంకు, తాళ్ల అదిత్య 6220వ ర్యాంకు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం సుజాత, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆర్జీ-1 ఏరియాలో క్వార్టర్ల కౌన్సెలింగ్

గోదావరిఖని: రామగుండం రీజియన్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఆర్జీ-1 ఏరియాలో నాన్ ఆప్టెడ్ క్వార్టర్ల కౌన్సెలింగ్ బుధవారం స్థానిక ఆర్‌సీఓఏ క్లబ్‌లో నిర్వహించారు. డీ, టీటూ టైప్ క్వార్టర్లకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో సీనియారిటీ ప్రాతిపదికన క్వార్టర్లు కేటాయించారు. ఎస్‌వోటూ గోపాల్‌సింగ్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సీనియర్ పీవో శ్రావణ్‌కుమార్, హన్మంతరావు, రవీందర్, ఇక్బాల్ షరీఫ్, గణేశ్ పాల్గొన్నారు.

జూన్ 3న జేబీసీసీఐ సమావేశం

గోదావరిఖని: ఉత్తరాంచల్‌లోని డెహ్రాడూన్‌లో జూన్ 3న జేబీసీసీఐ స్టాండర్డైజేషన్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు బీఎంఎస్ నాయకుడు యాదగిరి సత్తయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బొగ్గు గని కార్మికుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి పలు అంశాల పరిష్కారానికి ఈ సమావేశంలో చర్చిస్తారని ఆయన పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ సింగరేణి కార్మికుడు మృతి

గోదావరిఖని: స్థానిక గాంధీనగర్‌లోని డీ-399 క్వార్టర్లలో నివాసముంటూ ఎస్‌ఆర్‌పీ ఓసీపీ ల్యాంప్ రూం జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్న మందిడి సాంబమూర్తి(53) మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఎస్సై భూమేశ్ కథనం ప్రకారం కొంత కాలంగా తాగుడుకు బానిసైన సాంబమూర్తి ఈ ఏడాది జనవరి 4న ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతడిని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించిన అనంతరం కరీంనగర్ ఆసుపత్రికి రెఫరల్ చేశారు. వెంటిలేషన్ చికిత్స పొందినప్పటికీ ఆరోగ్యం కుదుట పడకపోవడంతో గోదావరిఖని సింగరేణి ఆసుపత్రికి తిరిగి పంపించారు. నరాలు చచ్చుబడి సగం బ్రెయిన్ డెడ్ కావడంతో ఇంటికి పంపించి మందులు అందిస్తున్నారు. మంచంపైనే ఉంచి చికిత్స అందిస్తున్న ఈక్రమంలో సాంబమూర్తి పరిస్థితి విషమించడంతో స్థానిక సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుమారుడు కార్తికేయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

ముత్తారం: ముత్తారంలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం ఐదురోజులు ఉంటుందని మండల ఇన్‌చార్జి ఎంఈవో హరిప్రసాద్ తెలిపారు. ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం నూతన సాంకేతిక విద్యాబోధనకు ఎంతోగానో ఉపయోగపడుతుందన్నారు. డీఆర్పీ ఈర్ల సమ్మయ్య, ఎంఆర్‌పీలు రాజేందర్, లక్ష్మణ్, వెంకటేశ్, అంజయ్య, ప్రసుమతి, తిరుపతి, శ్రీధర్, ఓంకార్ పాల్గొన్నారు.

రాయితీపై జీలుగ విత్తనాలు పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్, ఏవో

ముత్తారం: ముత్తారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో బుధవారం ఆ సంఘం చైర్మన్, వైస్ చైర్మన్‌లు అల్లాడి యాదగిరిరావు, ఎలువాక కొమురయ్య, డైరెక్టర్లతో కలిసి మండల వ్యవసాయాధికారి అనూష రాయితీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. 250 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో తెలిపారు. ఆసక్తి గల రైతులు తమ ఆధార్, పట్టాబుక్కులతో పీఏసీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఆ సంఘం సీఈవో దాసరి ప్రసాద్, డైరెక్టర్లు పోతిపెద్ది రమణరెడ్డి, గుజ్జ గోపాల్‌రావు, గిరి వీరేందర్, వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

గైర్హాజర్ కాకుండా విధులు నిర్వహించాలి



నియామక పత్రాలు అందిస్తున్న జీఎం వెంకటయ్య

గోదావరిఖని: విధుల్లో చేరే యువ ఉద్యోగులు గైర్హాజరు కాకుండా విధులు నిర్వహించి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య కోరారు. జీఎం కార్యాలయంలోని తన చాంబర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యువ ఉద్యోగులకు కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. అనంతరం జీఎం మాట్లాడుతూ క్రమశిక్షణతో ముందుకు సాగుతూ సీనియర్ ఉద్యోగుల సూచనల మేరకు ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ఏఐటీయూసీ నాయకులు జీగురు రవీందర్, అఫిషియేటింగ్, ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం సంతోష్‌కుమార్, డీజీఎం(పర్సనల్) ఎస్.అనిల్‌కుమార్, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, డీవైపీఎం వంశీధర్, నాయకులు అన్నారావ్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం



సన్మానిస్తున్న జీఎం వెంకటయ్య

గోదావరిఖని: వకీల్‌పల్లిగనిలో గ్రూప్ ఇంజినీర్‌గా పనిచేసి బదిలీపై కొత్తగూడెం ఏరియా కార్పొరేట్‌కు వెళ్తున్న చంద్రశేఖర్‌ను ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



సమావేశం నిర్వహిస్తున్న ఆర్జీ-3 ఇన్‌చార్జి, ఏపీఏ జీఎం కె.నాగేశ్వరరావు

రామగిరి: కార్పొరేట్ కార్యాలయ పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆర్జీ-3 ఇన్‌చార్జి, ఏపీఏ జీఎం కొలిపాక నాగేశ్వరరావు అన్నారు. ఆర్జీ-3, ఏపీఏ ఏరియాలో ప్రాతినిధ్య సంఘమైన ఐఎన్‌టీయూసీ ప్రతినిధులతో బుధవారం జీఎం కార్యాలయంలో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించారు. ఏరియాలకు సంబంధించిన పలు అంశాలపై ప్రాతినిధ్య సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి, సభ్యులతో ఆర్జీ-3 ఇన్‌చార్జి, ఏపీఏ జీఎం చర్చించారు. ఏరియాలోని క్యాంటీన్‌లు, జీఎం కార్యాయంలోని వివిధ విభాగాల్లో ఏసీలు అమర్చడం, సెంటినరికాలనీలో ఎండిపోయిన చెట్లకొమ్మలు తొలగించడం, రాణిరుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో వాకింగ్ ట్రాక్ పునరుద్ధరణ వంటి పలు అంశాలపై చర్చించారు. జీఎం మాట్లాడుతూ ఏరియా పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా వివరాలు సేకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో స్ట్రక్చర్ కమిటీ సభ్యులు రామరావు, సాయికృష్ణ, బెల్లం శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర్ బాబు, కె.యాదయ్య, ఎస్‌వోటూ జీఎం బి.వి.సత్యనారాయణ, ప్రాజెక్టు అధికారులు జె.రాజశేఖర్, సీ.హెచ్.వెంకటరమణ, విభాగాధిపతులు కె.చంద్రశేఖర్, బి.సుదర్శనం, బి.రాజేంద్రకుమార్, కాశీ విశ్వేశ్వరరావు, అధికారులు చంద్రశేఖర్, జి.వి.సత్యనారాయణ, హుస్సేన్ పాల్గొన్నారు.

మానస దంపతులకు బహుమతి



రామగుండం: రామగుండం తబిత అనాథ ఆశ్రమంలో పెరిగిన అమ్మాయి మానస పెళ్లి బుధవారం జరిగింది. కాగా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు, తహసీల్దార్ తూము రవీందర్ నవ దంపతులను ఆశీర్వదించి బహుమతి అందించారు. టీజీవోస్ అసోసియేషన్ సెక్రటరీ బ్రహ్మానందరెడ్డి, కోశాధికారి కరుణాకర్, ఉపాధ్యక్షుడు సాజిద్, సంయుక్త కార్యదర్శి అలేఖ్య, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, జిల్లా తూనికలు కొలతల అధికారి విశ్వేశ్వర్, సీపీవో రవీందర్, ఆర్డీవో మంథని సురేశ్, కలెక్టరేట్ ఎస్పీ ప్రకాశ్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్ ద్వారా రూ.6లక్షల సాయం



చెక్కు అందజేస్తున్న రాజశేఖర్

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ (యూఆర్‌ఎస్)లో తెలుగు సీఆర్‌టీగా పనిచేసిన జంగిడి రాజేందర్ ఇటీవల మరణించారు. కాగా ఆయన కుటుంబీకులకు బుధవారం ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.6లక్షలను చైర్మన్ రాజశేఖర్, తదితరులు అందించారు. కేజీబీవీ, యూఆర్‌ఎస్ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు. నాయకులు లక్ష్మారెడ్డి, గోల్కొండ శ్రీధర్, కుమారస్వామి, లక్ష్మణ్, సతీశ్ ఉన్నారు.

తడిసిన ధాన్యం.. రైతు దైన్యం

- పలు ప్రాంతాల్లో అకాల వర్షం



ఎల్కలపల్లిలో తడిసిన ధాన్యం కుప్పలు

ఫెర్టిలైజర్‌సిటీ: జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కురిసిన అకాల వర్షంతో అన్నదాతలు మళ్లీ ఆగమయ్యారు. మొన్నటి వరకు రెండు దఫాలు కురిసి వానలతో ధాన్యం తడిసి ముద్దవ్వగా.. తాజాగా కొనుగోలు కేంద్రాల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన వడ్లు నీటిపాలయ్యాయి. కళ్లెదుటే వడ్లు వర్షపు నీటిలో కొట్టుకుపోవడంతో అన్నదాతలు కన్నీటి పర్యంతమయ్యారు.

తూకం వేసేందుకు సిద్ధంగా ఉన్న వడ్లు..

పాలకుర్తి మండలం గుంటూరుపల్లి, ఎల్కలపల్లి కొనుగోలు కేంద్రాల్లో తూకం నత్తనడకన సాగుతోంది. గుంటూరుపల్లి కొలుగోలు కేంద్రంలో సుమారు 2,000 క్వింటాళ్లు, ఎల్కలపల్లిలో 1,500 క్వింటాళ్ల ధాన్యం తూకం వేసేందుకు సిద్ధంగా ఉంది. అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు త్వరితగతిన పూర్తి చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కాగా ఎల్కలపల్లి గేట్‌లోని పలు ఇళ్లలోకి వర్షపునీరు చేరింది. నాలాలో చెత్త పేరుకుపోయి ఉండడంతో వర్షపు వెళ్లేందుకు వీలులేక ఇళ్లను ముంచెత్తింది.

పాలకుర్తిలో..

పాలకుర్తి: పాలకుర్తిలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతమై ఉంది. సాయంత్రం వేళలో ఒక్కసారిగా ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గంటపాటు ఏకధాటిగా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు చేరింది.

దీక్ష విరమణకు తరలిన హనుమాన్ దీక్షాపరులు

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో హనుమాన్ మాల ధరించిన స్వాములు దీక్ష విరమించేందుకు కొండగట్టు అంజన్న సన్నిధికి తరలి వెళ్తున్నారు. అబ్బాపూర్‌లో హనుమాన్ మాలధారణ స్వాములు బుధవారం వేకువజామునే స్థానిక హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి పాదయాత్రగా కొండగట్టుకు బయలుదేరారు. స్వాములకు మహిళలు మంగళహారతులతో వీడ్కోలు పలికారు. గురువారం నిర్వహించనున్న హనుమాన్ జయంతి ఉత్సవాల్లో పాల్గొని దీక్ష విరమించనున్నట్లు హనుమాన్ స్వామి, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు దండె వెంకటేశం తెలిపారు. వెంకట్‌రెడ్డి, గంగారెడ్డి, చిన్నయ్య, రాజు, ఆగారెడ్డి, మారుతి, సంపత్, సూర్యనారాయణ ఉన్నారు.